క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

తరిగొప్పుల: నకిలీ విత్తనాలు విక్రయించినా, విత్తనాలు అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రామారావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఏఓ పి. మనోహిత్ విక్రమరావుతో కలిసి తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, శ్రీరాజరాజేశ్వరీ సీడ్స్, ఫర్టిలైజర్స్ దుకా ణాలను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరి శీలించారు. ధరల పట్టికను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్సై శ్రీదేవి ఉన్నారు.

కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


మాట్లాడుతున్న రాజయ్య

రఘునాథపల్లి: మాజీ సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కాళేశ్వరం కమిషన్ పేర కాంగ్రెస్ పార్టీ కక్ష పూరిత రాజకీయాలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం గొప్ప ప్రాజెక్ట్ అని స్వయాన సుప్రీం కోర్టు పేర్కొందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి దళితులను చీల్చాలని కుట్రలు పన్నుతున్నాడని ఆరోపించారు. మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, పెండ్లి మల్లారెడ్డి, విజయ్, సత్తయ్య, హరీష్ పాల్గొన్నారు.

దైవ చింతన కలిగి ఉండాలి


నగర సంకీర్తన చేస్తున భక్తులు

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని అర్చకులు జంగిలి అంజనేయులు, ముక్తేశ్వర్ అన్నారు. మంగళవారం కేసిరెడ్డిపల్లి, బండనాగారం గ్రామాల్లో ఏకాదశి సందర్భంగా నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు దామెర రాములు, గాలి తిరుపతి, ఇమ్మడి రాధాభాయ్, పెసరు ధర్మయ్య, ఇజ్జగిరి నారాయణ, పల్లపు రామకృష్ణ పాల్గొన్నారు.

40 మంది విద్యార్థుల గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో శుక్రవారం నిర్వహించి రెండో రోజు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం ఫస్టియర్ జనరల్, ఒకేషనల్ 378 మంది విద్యార్థులకు 344, మధ్యాహ్నం సెకండియర్‌లో 55 మందికి 49 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

శివునిపల్లి మాజీ సర్పంచ్ శంకర్‌రావు మృతి


శంకర్‌రావు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మండలంలోని గత మేజర్ గ్రామ పంచాయతీ శివునిపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పార్శి శంకర్‌రావు(85) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. 1981 నుంచి శంకర్‌రావు వరుసగా మూడుపర్యాయాలు శివునిపల్లి సర్పంచ్‌గా, రెండున్నర సంవత్సరాలు ఉపసర్పంచ్ నుంచి సర్పంచ్‌గా మొత్తం పదిహేడున్నర సంవత్సరాలు సర్పంచ్‌గా విశేష సేవలు అందించారు. అతడికి భార్య భాగ్యలక్ష్మీ, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

సంతాపం

శంకర్‌రావు మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య శివునిపల్లిలోని వారి నివాసంలో మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అతడి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణానికి నేడు భూమిపూజ

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్పీడీసీఎల్ డీఈ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి నేడు(శనివారం) ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ రాంబాబు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన మధ్యాహ్నం 12 గంటలకు చేపట్టనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బంది, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు

- తడిసిన ధాన్యం ఆరబోత
- 20 రోజులైనా మిల్లులకు తరలించక అన్నదాతల అవస్థలు
- వెంటాడుతున్న వర్షాలు
- పట్టించుకోని అధికారులు


చిల్పూరులో కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం

చిల్పూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు పండించిన ధాన్యంను తీసుకొస్తే విక్రయించుకోలేని పరిస్థితి నెలకొంది. అకాల వర్షాలు, నిర్వహణ లోపాలు, సౌకర్యాల లేమి రైతులను కలవరపెడుతున్నాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబోసి రాత్రింబవళ్లు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో పీఏసీఎస్, ఐకేపీల ద్వారా 10 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు పండించిన ధాన్యం మొదటి విడతలో కేంద్రాలకు తీసుకవచ్చింది తరలిపోయినప్పటికీ, నెల రోజుల క్రితం తీసుకవచ్చిన ధాన్యం రాశులు పోసుకున్నా తరలించే ఏర్పాట్లు చేయక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 22వేల ఎకరాల్లో వరిపంటను సాగుచేయగా అధికారుల నిర్లక్ష్యంతో రైతులు అవస్థలు పడుతున్నారు. సంచుల కొరతతో అధికారులు ధాన్యాన్ని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. వాతావరణంలో జరుగుతున్న మార్పులు రైతులకు మరోసమస్యగా మారింది. ఎప్పుడు ఎండకాస్తుందో, ఎప్పుడు ఈదురుగాలలతో వర్షం పడుతుందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి ఎండ ఉండగానే వర్షం పడుతుండడంతో ఎంత జాగ్రత్త పడినా ధాన్యం తడిసి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ధాన్యంను కొనుగోలు కేంద్రాలను నుంచి త్వరగా తరలించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

మొలకలు వచ్చాక తరలిస్తారా..



ధాన్యం తీసుక వచ్చి 20 రోజులు దాటుతాంది. రోజూ కాంటా చేసి పంపిస్తామంటున్నారే తప్ప ధాన్యం మాత్రం కదలడం లేదు. ప్రతీ రోజు ధాన్యం కుప్పలు చేసుకోవడం, కవర్లతో కప్పుకోవడం, మళ్లీ ఉదయాన్నే ఆరబోసుకొంటున్నాం. మొలకలు వచ్చాక కొనుగోలు చేస్తారా.

– ఎర్ల రమ, రైతు

బస్తాకు రూ. 10 అదనంగా ఇచ్చి ట్రాక్టర్ ద్వారా తరలించా



25 రోజుల తర్వాత కేంద్రంలోని ధాన్యం బస్తాల్లో నింపాక లారీ అక్కడికి వచ్చే పరిస్థితి లేక పోవడంతో అదనంగా బస్తాకు రూ.10 చెల్లించి ట్రాక్టర్ ద్వారా లారీ వరకు తరలించా. వర్షాలు భారీగా పడక ముందే ధాన్యాన్ని మిల్లుకు తరలించాలి.

– తోట వెంకన్న, రైతు

వారం రోజుల్లో కేంద్రాలను ఖాళీ చేయిస్తాం



ఈసారి కొన్ని కారణాల వలన రైతులు సమస్యలను ఎదుర్కొన్నారు. వారం రోజుల్లో ధాన్యం మొత్తం మిల్లులకు తరలించే ఏర్పాటు చేసి కేంద్రాలను ఖాళీ చేయిస్తాం.

– ఈద రమేష్‌కుమార్, ఏపీఎం, ఐకేపీ

పేదలకు భరోసా.. సీఎం సహాయ నిధి


చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో కిరణ్‌కుమార్

జనగామ: రాష్ట్రంలోని పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఓ పేద కుటుంబానికి మంజూరైన రూ.1.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కిరణ్ అందించిన అనంతరం మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధితో అన్ని వర్గాల ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆయన వెంట ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్య, ఓబీసీ జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగాల రాజేందర్ రెడ్డి, నరేష్ గౌడ్, పృథ్వీ, కాల్వ నాగరాజు, కనకరాజు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

తరిగొప్పుల: మండలంలోని సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2 లక్షల విలువైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు నాగపూరి కిరణ్‌కుమార్ గౌడ్ పంపిణీ చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రం ప్రధాన కూడలివద్ద ఈ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మాజీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్, దూడాల సిద్దయ్య, సిరిగిరి దాసు, ఏడెల్లి శ్రావణ్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు


పాలకుర్తి టౌన్: మాట్లాడుతున్న రవీంద్ర


బచ్చన్నపేట: శిక్షణ ఇస్తున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: ప్రస్తుత సమాజాన్ని మార్పు చేసే గొప్ప అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని, ప్రతి ఉపాధ్యాయుడు నవ సమాజ నిర్మాత అని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తక్కలపల్లి రవీంద్ర అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు మార్గదర్శకుడై ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవడంలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ఉపాధ్యా శిక్షకులుగా సూర్య ప్రకాష్, శేష గిరిరావు, ప్రణయ్ ,శ్రీనివాస్, ఏకాంబరం, క్రాంతికుమార్, రమేష్, ఇమ్మడి అశోక్, చిదురాల శ్రీనివాస్,డొకురు రాములు, తండ మల్లయ్య, శైలజ, సరళ, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

బచ్చన్నపేట: తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యంను బట్టి ఉపాధ్యాయులు వారిని విభజించి మెరుగైన విద్యను అందించాలని ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఐదో రోజు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేసే 90 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఐదు రోజుల పాటు ఇచ్చామన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


బాంజీపేటలో గ్రామ దేవతలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

రఘునాథపల్లి: పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పు ఉన్నా.. పేదల కష్టాలను గుర్తించి వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఇన్‌చార్జ్ ఆర్డీఓ సుహాసిని, తహసీల్దార్ ఎండీ మొహ్సిన్ ముజ్తబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, నాయకులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, బొల్లం అజయ్, కోళ్ల రవిగౌడ్, లింగాజి, నామాల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. బాంజీపేటలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సేవా కార్యక్రమాలు


కుట్టుమిషన్ అందజేస్తున్న ప్రతినిధులు

జనగామ: వాసవి, వనితా క్లబ్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రాంతీయ చైర్మన్ సీహెచ్ కళావతి హాజరయ్యారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, అనూజా పెళ్లిరోజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాధంశెట్టి వరూధిని కుమారుడు వరుణ్ సందేశ్ జన్మదిన పురస్కరించుకుని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో టాయిలెట్ నిర్మాణం కోసం ప్రిన్సిపాల్ శ్రీనివాస కోరిక మేరకు రూ.10వేల సాయం అందించారు. అనంతరం నిరుపేద ఆర్యవైశ్య మహిళకు కుట్టుమిషన్ అందించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్ష, కార్యదర్శులు పడకండి రవీందర్, గట్టు రాధాకృష్ణ, కొకోటి రామారావు, మాడిశెట్టి కళావతి, కాపర్తి శ్రీనివాస్, మాధవి, తమ్మిశెట్టి మల్లికార్జున్ ప్రమీల, దారం నర్సయ్య, విజయ,

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

డీఏఓ రామారావు నాయక్


నోటీసు అందజేస్తున్న డీఏఓ

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయిన లబ్ధిదారులు నిర్మాణాలు వెంటనే చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన సాల్వాపూర్‌లో 70 ఇళ్లు మంజూరు కాగా 36 ఇళ్లకు ముగ్గు పోశారన్నారు. 8 రూఫ్ లెవల్, 24 బేస్మెంట్ లెవల్ ఉన్నాయని, నిర్మాణాలు మొదలుపెట్టవారికి నోటీసులు అందించి వారంలో పనులు ప్రారంభించాలని సూచించినట్లు తెలిపారు. ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, హౌజింగ్ ఏఈ ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి మామిడాల మధు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటేష్, నాయకుడు బండకింది హరిబాబుగౌడ్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

జనగామ రూరల్: పట్టణంలోని ఏసీరెడ్డినగర్ డబుల్‌బెడ్రూం కాలనీ, బాణాపురం, ఐలమ్మనగర్ గుడి ఏరియా ప్రాంతాల్లో తాగునీటి సమస్య కోసం వాటర్ నిర్మాణానికి అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల సీపీఎం నాయకులు ఆయా కాలనీల్లో తాగునీటి అధికంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, కలెక్టర్ రిజ్వాన్‌బాషా ప్రత్యేక చొరవ తీసుకుని అమృత్ పథకంలో 6లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ డీఈ రాజకుమార్ శోద కన్‌స్ట్రక్షన్ కంపెనీ డిపిఎం సంపత్, కాంట్రాక్టర్ బి యాకయ్య, మున్సిపల్ వాటర్ సూపర్వైజర్ ఉడుగుల సురేందర్ డబల్ బెడ్రూం కాలనీలో స్థలాన్ని వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం పరిశీలన చేశారు. కాలనీ వాసులు బూడిది ప్రశాంత్, బూడిది నవీన్, పసులాది హరీష్, రాజు, ధరావత్ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి


లింగాలఘణపురం: ఈ నెల 25న మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వడిచర్ల మాజీ సర్పంచ్ కృష్ణ, నేలపోగుల మాజీ ఎంపీటీసీ నర్సయ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అనుబంధ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నేలపోగుల మాజీ ఎంపీటీసీ నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, యూత్ రాష్ట్ర నాయకులు దిలీప్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, నాగేందర్, భాస్కర్, సంపత్, నాగరాజు, కిష్టయ్య, రాజు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

జనగామ రూరల్: ఆరుకాలం కష్టపడుతున్న రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. శుక్రవారం నాటికి కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ ముగిసిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఉర్సుల కుమార్, యాదగిరి, భాస్కర్ రెడ్డి, ఐకేపీ నిర్వాహకులు స్వర్ణ, స్వరూప, లక్ష్మి, హమాలీలు జిల్లెల నర్సయ్య, చింతకింది భిక్షపతి, బనుక గట్టయ్య పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితంగానే వర్గీకరణ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్


మాట్లాడుతున్న గోవిందు నరేష్

జనగామ రూరల్: మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యం అయిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మందకృష్ణ రాజీలేని పోరాటం చేయడం వల్లే ఎస్సీ వర్గీకరణ నేడు అమలులోకి వచ్చిందని అన్నారు. మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు లభించిన సందర్భంగా వరంగల్ నగరంలో సన్మానం చేయనున్నట్లు తెలిపారు. రాగల్ల ఉపేందర్, రాజశేఖర్, బిర్రు నాగేష్, బొట్ల మహేష్, గద్దం సోమరాజు, దరవత్ స్వామి నాయక్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీత నిర్మల భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు.

రైతులు కిసాన్ కార్డు పొందాలి

బచ్చన్నపేట: పీఎం నరేంద్రమోదీ సూచనల మేరకు ప్రతి రైతు కిసాన్ కార్డు పొంది ఉండాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆయా గ్రామాల క్లస్టర్ రైతు వేదికల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద కిసాన్ కార్డు కోసం వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. రైతు పట్టేదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింకు ఉన్న నంబర్ గల ఫోన్‌ను తీసుకెళ్లి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం ద్వారా అందే ప్రతి సబ్సిడీ కిసాన్ కార్డుల ద్వారానే వస్తాయని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

జఫర్‌గఢ్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, రైతుబంధు, సన్నవడ్లకు బోనస్, ఇందిరమ్మ తదితర పథకాలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. నాయకులు వడ్లకొండ సుధాకర్, కాట సుధాకర్, ఎండీ షబానా, నక్క యాకయ్య, రాపర్తి రజిత, వేల్పుల రాములు, రవి, వడ్లకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

జనగామ రూరల్: పట్టణానికి చెందిన మేడిపల్లి కళ్యాణ్ జయంతి సందర్భంగా సోదరుడు మేడిపల్లి కార్తీక్ సహకారంతో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణి, స్నేహితులు కార్తీక్, సోహెల్, విజయ్, పవన్, లింగం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి


మాట్లాడుతున్న కనకారెడ్డి

పాలకుర్తి: హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ నాయకత్వంలో 2005లో ఏర్పడిన జాతీయ వ్యవసాయ కమిషన్ నివేదికను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణయించాలని, భూసమస్యల పరిష్కారానికి సమగ్ర సర్వే మాత్రమే మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.కనకారెడ్డి అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామంలో పార్టీ చిట్యాల సోమన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో కనకారెడ్డి, బి.చందు నాయక్‌లు మాట్లాడారు. భూ భారతి చట్టాన్ని అమలు చేయాని అన్నారు. మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, సోమ సత్యం, ఏదునూరి మదార్, బెల్లి సంపత్, నాయని శ్రీను, జక్కుల శోభన్‌బాబు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలని దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు, దళిత రత్న అవార్డు గ్రహీత కలకోల యాదగిరి డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ అధ్యక్షతన ఘన్‌పూర్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చాడ ఏలియా, గుర్రం అశోక్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు చింత జగదీష్, రడపాక ఆరోగ్యం, జీడి ఆనందం, రాజశేఖర్, గుర్రం శ్రీను, మారపాక రమేష్ పాల్గొన్నారు.

మాదిగలపై మాట్లాడే హక్కు రాజయ్యకు లేదు

జఫర్‌గఢ్: దళిత బంధు పేరుతో మాదిగలను మోసం చేసిన రాజయ్యకు మాదిగల గురించి మాట్లాడే నైతిక హక్కు ఏమాత్రం లేదని కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గంగాదరి యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు మొగిళిపాక నర్సింగం, రడపాక డానియల్, కొడారి సాంబరాజు, తాటికాయల యాకనాథం పాల్గొన్నారు.

ఇసుక అనుమతులు ఇచ్చి కరువు తేవొద్దు

దేవరుప్పుల: మండలేతర ప్రాంతాలకు ఇసుక అనుమతులు ఇచ్చి తమ గ్రామానికి కరవు తేవొద్దని గ్రామస్తులు వాపోతున్నారు. శుక్రవారం గొల్లపల్లి వాగు నుంచి కొడకండ్ల మండలం నీలిబండతండా దాకు ఇరవై ఐదు ట్రాక్టర్ల ఇసుక తీసుకెళ్లేందుకు స్థానిక తహసీల్ అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు ట్రాక్టర్‌లు వాగులోకి రాగా గ్రామస్థులు అడ్డుకొని వెళ్లగొట్టారు. ఈ విషయమై తెలిసి ఎస్సై ఊర సృజన్‌కుమార్ చేరుకోగా ససేమిరా వాగులో నుంచి ఇసుక తరలించే ప్రసక్తిలేదని డిమాండ్ చేశారు. దీంతో అధికారుల పర్యవేక్షణలో తిరిగి దేవరుప్పుల–గొల్లపల్లి సరిహద్దు వాగులో నుంచి నాలుగైదు ట్రిప్పులు తీసుకెళ్తుండగా మరోసారి అడ్డుకోవడం గమనార్హం. అనంతరం గ్రామస్తులు తమ ప్రాంతం డార్క్ ఏరియాగా గుర్తించినప్పటికీ ఇలాంటి ఇసుక అనుమతులు ఇచ్చి భూగర్భజలాలు అడుగంటే పరిస్థితి రాకుండా చూడాలని తహసీల్దార్ అండాళుకు వినతి పత్రం అందజేశారు.

రోడ్డు తవ్వారు.. పూడ్చడం మరిచారు


చంపక్‌హిల్స్ ఎంసీహెచ్ వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

జనగామ: జనగామ–సిద్దిపేట ప్రధాన రహదారి చంపక్‌హిల్స్ ఎంసీహెచ్ సమీపం మలుపు వద్ద పైపులైన్ కోసం రోడ్డును తవ్విన అధికారులు.. నిర్లక్ష్యంగా వదిలేశారు. పీజీ కళాశాల భవన నిర్మాణ పనుల కోసం రోడ్డును తవ్వగా.. కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతోంది. మలుపు వద్ద వాహన వేగాన్ని నియంత్రించే సమయంలో బైకిస్టులు పల్టీలు కొడుతున్నారు. కార్లు అదుపు తప్పి ప్రమాదం ఉండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. రాత్రి సమయంలో గుంత కనిపించక పోవడంతో సడెన్ బ్రేకులతో లారీలు, కార్లు అదుపు తప్పి.. పక్కనే ఉన్న వ్యాపార సముదాయల వద్దకు దూసుకు వస్తున్నాయని హాస్పిటల్‌కు వచ్చే వారు అంటున్నారు. అధికారులు స్పందించి తవ్విన రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు


సూర్యాపేట వైపు వెళ్లేందుకు బ్రిడ్జి ఎక్కుతుండగా నిలిచిన వాహనాలు

లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల బైపాస్ బ్రిడ్జి అటు ప్రారంభంలో ఇటు చివరలో భారీ వాహనాలు మలుపు తిరిగే సమయంలో ప్రమాదకరంగా ఉంది. హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్లే వాహనాలు బ్రిడ్జి ఎక్కేటప్పుడు, హనుమకొండ నుంచి సిద్దిపేట వైపు వెళ్లే వాహనాలు బ్రిడ్జి ఎక్కేటప్పుడు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. బ్రిడ్జి చివరి నుంచి కొద్ది దూరం వెళ్లి మలుపు తిరిగేందుకు రోడ్డు పెద్దగా లేకపోవడం, బ్రిడ్జి చివరలోనే రోడ్డు పెద్దగా ఉండడంతో అక్కడే వాహనాలను మలుపు తీసుకోవడంతో అటు బ్రిడ్జిపై నుంచి వచ్చే వాహనాలకు, ఇటు నేరుగా బ్రిడ్జి ఎక్కే వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జి చివరనే భారీ వాహనాలు మలుపు తీసుకోకుండా కొద్ది దూరం ముందుకు వెళ్లి టర్నింగ్ తీసుకుని బ్రిడ్జి ఎక్కితే ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందని నిపుణులు అంటున్నారు.